క్లుప్తంగా

రామాలయానికి రథం బహూకరణ



నూతన రథంతో గ్రామోత్సవం నిర్వహిస్తున్న దాతలు, భక్తులు

పెదపూడి: అనపర్తి పాతూరులోని సత్తి పోతారెడ్డి, తేతలి రామిరెడ్డి రామాలయానికి అదే గ్రామానికి చెందిన కర్రి వీరరాఘవరెడ్డి, మాణిక్యం దంపతులు బుధవారం స్టీల్ రథాన్ని బహూకరించారు. వేద పండితుడు రెడ్డి సురేష్ శర్మ బ్రహ్మత్వంలో రథానికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం దానిలో ఉత్సవ మూర్తులను కొలువు తీర్చి పుర వీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా దాతలు మాట్లాడుతూ ప్రతి శనివారం వేంకటేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలను ఈ రథంలో ఉంచి గ్రామోత్సవం నిర్వహించడానికి మహాశివరాత్రి రోజున ఆలయ కమిటీ ప్రతినిధులకు అందజేశామన్నారు. కార్యక్రమంలో కర్రి ధర్మారెడ్డి, కర్రి మంగయమ్మ, జాహ్నవి, రూపిణి గంగ, నల్లమిల్లి సత్యనారాయణరెడ్డి, లక్ష్మీకాంతం దంపతులు పాల్గొన్నారు.

భక్తుల కోసం వైద్యశిబిరాలు



వంగలపూడి రేవులో ఏర్పాటు చేసిన వైద్య శిబిరం

సీతానగరం: సీతానగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు ఏవీకే చైతన్య ఆధ్వర్యంలో బుధవారం వంగలపూడి రేవులో రెండు వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. మహాశివరాత్రి సందర్భంగా వంగలపూడి రేవు నుంచి పట్టిసీమ వీరభద్రుని దర్శనానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివెళ్లారు. వీరి కోసం రేవులో ఒకటి, గోదావరి పాయ దాటిన తర్వాత ఇసుక తిన్నెల్లో రెండో శిబిరం నిర్వహించారు. అత్యవసర పరిస్థితిలో రోగులను తరలించడానికి రెండు అంబులెన్సులను సిద్ధంగా ఉంచారు. ఈ సందర్భంగా డాక్టర్ చైతన్య మాట్లాడుతూ రెండు వైద్య శిబిరాల్లో 816 మందికి వైద్య సేవలు అందించామన్నారు. ఆరుగురు వైద్యాధికారులు, 51 మంది సిబ్బంది పాల్గొన్నట్టు తెలిపారు.

అన్నదానానికి రూ.లక్ష విరాళం

మధురపూడి: మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా కోరుకొండ మండలం కణుపూరులోని భ్రమరాంబికా సహిత మల్లికార్జునస్వామి ఆలయంలో అన్నసమారాధనకు బుధవారం బీజేపీ నాయకుడు, విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షుడు కంబాల శ్రీనివాసరావు రూ.లక్ష విరాళం అందించారు. ఈ సందర్భంగా స్వామివారిని ఆయన దర్శించుకున్నారు. అన్నసమారాధనలో పాల్గొని, భక్తులకు వడ్డించారు.

మట్టి శివలింగానికి పూజలు



శివలింగానికి పూజలు చేస్తున్న మహిళలు

రాజానగరం: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని రాజానగరం న్యూసిటీ కాలనీ వాసులు మట్టితో శివలింగాన్ని తయారు చేసి అభిషేకించారు. సాయంత్రం దీపారాధనలు చేసి, పూజలు ప్రారంభించి, శివనామ స్తోత్రంతో లింగోద్భవ సమయం వరకు పాలు, పండ్ల రసాలతో అభిషేకాలు చేశారు. ఏకకాలంలో ఈ అభిషేకాలతో మట్టి శివలింగానికి నిమజ్జనం కూడా జరిగిపోయింది.

ఉరి వేసుకుని వివాహిత ఆత్మహత్య



శ్రావణి మృతదేహం

సీతానగరం: మండలంలోని సింగవరానికి చెందిన గుమ్మళ్ల శ్రావణి (29) అనే వివాహిత బుధవారం ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రావణికి పదేళ్ల క్రితం వివాహమైంది. ఆమెకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కాగా.. ఇంటిలోని అత్తమావలు, భర్త లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఆమె కొంత కాలంగా కడుపు నొప్పితో బాధ పడుతోందని, తట్టుకోలేక ఈ అఘాయిత్యానికి పాల్పడిందని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. అయితే కుటుంబ కలహాలు కారణమని వార్తలు వినిపిస్తున్నాయి. ఆమె భర్త దుర్గాప్రసాద్ కోడిగుడ్ల వ్యాపారం చేస్తుంటాడు. శ్రావణి మృతదేహాన్ని పోలీసులు రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.



బిక్కవోలులో కొలువైన కేదారేశ్వరస్వామి



పందలపాకలో గౌరీశంకర స్వామి



జి.మామిడాడలోని మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామి



జి.మామిడాడ ఎల్ఎన్ పురంలో భీమేశ్వరస్వామి రథానికి నమస్కరిస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి దంపతులు



జి.మామిడాడలో బ్రహ్మకుమారీలు ఏర్పాటు చేసిన రుద్రాక్ష శివలింగం

హరహర మహాదేవ

- మార్మోగిన శివనామస్మరణ
- భక్తులతో కిటకిటలాడిన శివాలయాలు



చక్రద్వారబంధంలో ఉమా లింగేశ్వరస్వామికి ఏకాదశ రుద్రాభిషేకం చేస్తున్న భక్తులు

రాజానగరం: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా రాజానగరం, అనపర్తి నియోజకవర్గాల్లో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. హరహర మహాదేవ, శంభో శంకర అంటూ భక్తులు శివనామ స్మరణ చేశారు. తెల్లవారుజాము 3 గంటల నుంచి ఆలయాల్లో రద్దీ ఏర్పడింది. గోదావరికి సమీపాన ఉండే రాజానగరం, కోరుకొండ, సీతానగరం మండలాల్లోని పలు గ్రామాల భక్తులు అర్ధరాత్రి నుంచే పవిత్ర గోదావరిలో స్నానాలను ఆచరించారు. రాజానగరంలోని రాజలింగేశ్వరస్వామి ఆలయంలో తెల్లవారుజాము నుంచే పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు జరిగాయి. మహాదశ రుద్రాభిషేకాలు నిర్వహించి, రాత్రి 11 గంటల తర్వాత లింగోద్భవ కాల మహాన్యాస పూర్వక పంచామృతాభిషేకం నిర్వహించారు.

- జాతీయ రహదారిని ఆనుకుని నరేంద్రపురం జంక్షన్‌లోని కొలువుదీరిన ఈతచెట్టు ఈశ్వరుడి ఆలయం వద్ద అన్నసమారాధన చేశారు. దివాన్ చెరువు ఆగమ ఆశ్రమంలోని కాశీ అన్నపూర్ణ, విశాలాక్షి సమేత కాశీ విశ్వేశ్వరస్వామి, తూర్పుగానుగూడెం, పల్లకడియం, నందరాడ, నరేంద్రపురం, జి.యర్రంపాలెం, కానవరం, సంపత్ నగరం తదితర గ్రామాలలోని శివాలయాలకు భక్తుల తాకిడి ఏర్పడింది.
- సంపత్ నగరంలోని పర్వతవర్ధని శివ నాగేశ్వరునికి ముందు రోజు రాత్రే కల్యాణోత్సవం నిర్వహించారు. జాతీయ రహదారి ఆనుకుని ఉన్న ఆలయం వద్ద దాతల సహకారంతో అన్నసమారాధన జరిగింది.
- చక్రద్వారబంధంలో కొందరు మహిళలు కైలాస గౌరీ నోములు పట్టారు. సుమంగళి వ్రతం మాదిరిగానే పతుల యోగ క్షేమాలను కోరుకుంటూ మహాశివరాత్రి రోజున కైలాస గౌరీ నోములు పట్టడం, ఒకరికొకరు అందిపుచ్చుకోవడం ఆనవాయితీ. దేవీచౌక్ వద్ద ఉన్న మృత్యుంజయస్వామికి క్షీరాభిషేకం చేసి, ఉమాపార్థీవలింగేశ్వరస్వామికి ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు.

కిక్కిరిసిన శివాలయాలు

మధురపూడి: కోరుకొండ మండలంలో శివాలయాలకు భక్తుల రద్దీ ఏర్పడింది. కణుపూరు కొండపై వెలసిన భ్రమరాంబికా సహిత మల్లికార్జున స్వామిని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, రుడా చైర్మన్ బొడ్డు వెంకట రమణ చౌదరి దర్శించుకున్నారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి పూజలు జరిపారు.

- బుచ్చెంపేటలోని ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. స్థానిక కోనేటిలో స్నానమాచరించి, స్వామివారిని దర్శించుకున్నారు.
- బూరుగుపూడి భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి, కాపవరం కాశీ అన్నపూర్ణా సమేత విశ్వేశ్వరస్వామికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు జరిగాయి.

ఆలయాలకు పోటెత్తిన భక్తులు

బిక్కవోలు: మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని శివాలయాలకు భక్తులతో పోటెత్తారు. బిక్కవోలులో ఏడాదిలో కేవలం మహాశివరాత్రి రోజు మాత్రమే దర్శనం భాగ్యం లభించే ప్రాచీన కేదారేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏఎంసీ మాజీ చైర్మన్ జంగా వీర వెంకట సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో గ్రామస్తులు భారీగా ఏర్పాట్లు చేశారు. స్వామివారిని దర్శించుకోవడానికి జిల్లా నలుమూలల నుంచి భక్తులు తరలివచ్చారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రాచీన గోలింగేశ్వరస్వామిని, ఊలపల్లి అగస్త్యేశ్వరస్వామి వారిని దర్శించుకున్నారు.

- పందలపాకలోని కాశీ అన్నపూర్ణా సమేత విశ్వేశ్వరస్వామి, గౌరీ శంకర ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతర అన్నసమారాధన నిర్వహించారు.
- కొంకుదురులోని త్రిముఖ లింగేశ్వరస్వామికి పంచామృతాభిషేకాలు జరిపారు. దాతల సహకారంతో పులిహోర, మంచినీటి ప్యాకెట్లు, పాలు ఉచితంగా పంపిణీ చేశారు.
- ఊలపల్లి, కొమరిపాలెం, తొస్సిపూడి, బలభద్రపురం, ఆరికరేవుల, రంగాపురం, ఇలపల్లి, కాపవరం గ్రామాల్లో మహాశివరాత్రి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

వైభవంగా పూజలు

పెదపూడి: మండలంలోని శివాలయాల వద్ద తెల్లవారుజామునుంచే భక్తుల రద్దీ నెలకొంది. సంపర గ్రామంలో వీక్షణ ముక్తేశ్వరస్వామి ఆలయానికి విశేష సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. జి.మామిడాడ శివారు ఎల్ఎన్‌పురంలోని భీమేశ్వరస్వామి ఆలయంలో రద్దీ పెరిగింది. సుమారు 10 వేల మందికి అన్నప్రసాద వితరణ జరిగింది.

- జి.మామిడాడ గ్రామంలోని బిక్కవోలు వెళ్లే రోడ్డులో గల మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.
- పైన గ్రామంలోని భద్రకాళీ సమేత వీరభద్ర స్వామి ఆలయంలో స్వామి వారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. పెదపూడిలోని శ్యామలాంబ సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో దీపాలు వెలిగించారు.
- దోమాడలోని ఉమా మాండేశ్వరస్వామి ఆలయంలో భారీ సెట్టింగ్‌లు, విద్యుద్దీపాలంకరణ ఆకట్టుకున్నాయి. జి.మామిడాడ బ్రహ్మకుమారీస్ ఈశ్వరీ విద్యాలయంలో ఏర్పాటు చేసిన రుద్రాక్ష శివలింగాన్ని పుట్టకొండ గ్రామ సర్పంచి వల్లు వెంకట రమణ తదితరులు దర్శించుకున్నారు.
- కరకుదురు, రామేశ్వరం, ఏపీత్రయం, కరకుదురు, శహాపురం, కాండ్రేగుల, పుట్టకొండ, కైకవోలు, కుమారప్రియం, చింతపల్లి, వేండ్ర, రాజుపాలెం, గండ్రేడు, తదితర గ్రామాల్లో మహాశివరాత్రి ఉత్సవాలు ఘనంగా జరిగాయి.
- జి.మామిడాడలోని ఎల్ఎన్ పురంలో భీమేశ్వర స్వామి రథోత్సవంలో ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి దంపతులు పాల్గొన్నారు.

ఉమా రామలింగేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

రంగంపేట: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా రంగంపేటలోని ఉమా రామలింగేశ్వరస్వామి దేవాలయంలో మూడు రోజుల ఉత్సవాలను ఘనంగా ప్రారంభించారు. ఆలయ అర్చకుడు మైలవరపు నాగేంద్రశర్మ ఆధ్వర్యంలో గారపాటి నరేష్, అనంతలక్ష్మి దంపతులు పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణం సత్యహరిశ్చంద్ర నాటకంలోని కాటి సీనును ప్రదర్శించారు. స్థానిక హైస్కూల్‌కు చెందిన ఎం.సత్యవేణి శిష్య బృందం భ్రమరాంబిక, కార్తిక, స్వర్ణలత, సాహితి, దేవిశ్రీ, యామిని, పూజితల శాస్త్రీయ నృత్యాభినయం ప్రేక్షకులను అలరించింది. అనంతరం కళాకారులను, చిన్నారులను ఆలయ కమిటీ చైర్మన్ ఉండవల్లి జానకి రామారావు, గ్రామ పెద్దలు పోతుల వీరన్న, పిచ్చుకల అచ్యుతరామయ్యలు జ్ఞాపికలు అందించారు. హైస్కూల్ ఉపాధ్యాయిని ఎం.సత్యవేణిని శిష్య బృందం ఘనంగా సత్కరించింది. కార్యక్రమంలో ఉత్సవ నిర్వాహకులు వి.మాణిక్యం, దేవిన శ్రీనివాస్, మండవిల్లి గుప్తా, తనికెళ్ల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

- చంద్రేడులోని కాత్యాయనీ సమేత చంద్రశేఖరస్వామి ఆలయంలో ఆలయ అర్చకుడు మైలవరపు కృష్ణ దంపతులు పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు.



కొంకుదురులోని తుల్యభాగ నదిలో స్నానాలు చేస్తున్న భక్తులు



రంగంపేటలో ఉమా రామలింగేశ్వరస్వామికి పూజలు



రంగంపేటలో చిన్నారులకు మెమెంటోలు అందజేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు



బుచ్చెంపేటలో కొలువైన ఉమా రామలింగేశ్వరస్వామి

పరమశివునికి భక్తితో ప్రణమిల్లి..

- మాజీ ఎమ్మెల్యేలు జక్కంపూడి రాజా, సత్తి సూర్యనారాయణ రెడ్డి పూజలు
- పలు ఆలయాల సందర్శన



వంగలపూడి రేవులో మృత్యుంజయున్ని దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా



అనపర్తి ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయంలో మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి దంపతులు

సీతానగరం/మధురపూడి: మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, రాజానగరం మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా బుధవారం నియోజకవర్గంలోని పలు ఆలయాలను సందర్శించారు. అక్కడ స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సీతానగరం మండలం కాటవరంలోని రామలింగేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. వంగలపూడి రేవు వద్ద శివరాత్రి ఉత్సవాల్లో పాల్గొని, స్వామివారికి అభిషేకం జరిపించారు. కోరుకొండ మండలం కణుపూరులోని భ్రమరాంబిక సమేత మల్లికార్జునస్వామి ఆలయంలో 63వ మహాశివరాత్రి మహోత్సవంలో పాల్గొన్నారు. జంబూపట్నంలోని ఉమావిశ్వేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరమశివుడి కరుణా కటాక్షాలు ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. ప్రజలందరికీ మహాశివరాత్రి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వంగలపూడి రేవు నుంచి పట్టిసీమ వెళ్లి భద్రకాళీ సమేత వీరభద్రుని దర్శనం చేసుకున్నారు. ఆయన వెంట సీతానగరం, కోరుకొండ మండలాల వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ఆధ్యాత్మికతతో ప్రశాంతత

పెదపూడి: ఆధ్యాత్మిక భావాలతో మానసిక ప్రశాంతత లభిస్తుందని అనపర్తి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా బుధవారం నియోజకవర్గంలోని పలు ఆలయాలను సందర్శించారు. అనపర్తిలోని ఉమా రామలింగేశ్వరస్వామికి పూజలు చేశారు. ఆయన వెంట ఆలయ చైర్మన్ పోతంశెట్టి శ్రీనివాసారెడ్డి, సత్తిబాబు, ఎంపీటీసీ సభ్యుడు కొండేటి భీమేష్ పాల్గొన్నారు. అనపర్తిలో బ్రహ్మ కుమారీస్ ఆధ్వర్యంలో జరిగిన త్రిమూర్తి శివ జయంతిలో మాజీ ఎమ్మెల్యే దంపతులు పాల్గొన్నారు. జి.మామిడాడ శివారు ఎల్ఎన్ పురంలో మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామి వారిని మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు దర్శించుకున్నారు. కార్యక్రమాలలో రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ సత్తి రామకృష్ణారెడ్డి, మాజీ పీఏసీఎస్ చైర్మన్ సబ్బెళ్ల అమ్మిరెడ్డి, వప్పు అమ్మిరెడ్డి, ఉప సర్పంచ్ మేడపాటి తాతారెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు కర్రి పద్మావతి, నల్లమిల్లి భీమేశ్వరరెడ్డి, ద్వారంపూడి జగదీశ్వరరెడ్డి, మేడపాటి బుల్లిరెడ్డి, మేడపాటి రాంబాబు, ఆలయ కమిటీ ప్రతినిధులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

పట్టిసీమ వీరభద్రుని దర్శనానికి భక్తుల పయనం



వంగలపూడి రేవు నుంచి ట్రాక్టర్‌పై పట్టిసీమ వెళుతున్న భక్తులు



రామచంద్రపురం రేవు నుంచి వీరభద్రుని దర్శనానికి తరలివెళుతున్న భక్తులు

సీతానగరం: మహాశివరాత్రి సందర్భంగా ఏలూరు జిల్లా పోలవరం మండలం పట్టిసీమ వద్ద గోదావరి మధ్యలో కొలువైన భద్రకాళీ సమేత వీరభద్రుని దర్శనానికి వంగలపూడి, రామచంద్రపురం రేవుల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివెళ్లారు. వంగలపూడి రేవు నుంచి గోదావరి పాయపై వేసిన నడక మార్గం ద్వారా, పురుషోత్తపట్నం పంచాయతీ పరిధిలోని రామచంద్రపురం రేవు నుంచి ట్రాక్టర్లపై భక్తులు పయనమయ్యారు. వంగలపూడి రేవులోని మృత్యుంజయుని విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం సాయంత్రం 5 గంటల వరకు 25 వేలు మంది భక్తులువెళ్లారని, రాత్రి 10 గంటలకు వారి సంఖ్య 35 వేలకు చేరుకుందని అధికారుల తెలిపారు.

అధికారుల పర్యవేక్షణ

పట్టిసీమకు తరలివెళ్లే భక్తుల కోసం చేసిన ఏర్పాట్లను తహసీల్దార్ ఎ.శ్రీనివాస్, ఎంపీడీవో ఎం.భారతి, ఈవోపీఆర్డీ కేవీఎస్ఎస్ మూర్తి, పంచాయతీ కార్యదర్శి ఆర్.సుజాత, సర్పంచ్ కొంచ అన్నపూర్ణ, ఉత్సవ కమిటీ పర్యవేక్షించారు. వంగలపూడి, రామచంద్రపురం రేవులలో భక్తులకు భోజనం ఏర్పాట్లు చేశారు. రేవులలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా ఎస్సై డి.రామ్ కుమార్, సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. డీఎస్పీ వై.శ్రీకాంత్, సీఐ వై.సత్యకిషోర్ రేవులో పర్యవేక్షించారు. వంగలపూడి రేవులో సీతానగరం డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు సేవలు అందించారు. సీసీఎం ఎంఎల్ రాష్ట్ర కార్యదర్శి పలివెల వీరబాబు ఆధ్వర్యంలో పులిహోర, మజ్జిగ ప్యాకెట్లును అందించారు. కాగా.. మండలంలోని శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌కు అంతా సిద్ధం

- పూర్తయిన ఏర్పాట్లు
- కేంద్రాలలో వసతుల కల్పన



రాజానగరంలో పోలింగ్ కేంద్రం



బిక్కవోలు మండల పరిషత్ కార్యాలయం వద్ద పోలింగ్ సిబ్బంది

రాజానగరం: జిల్లాలో గురువారం జరిగే పట్టభద్రుల శాసన మండలి సభ్యుని (గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ) ఎన్నికల పోలింగ్‌కు మెటీరియల్, సిబ్బందితో సహా అంతా సిద్ధమైంది. అవసరమైన పోలీసు బలగాలతో పాటు, ఎన్నికల నిర్వహణకు ప్రతి పోలింగ్ కేంద్రానికి ఐదుగురు చొప్పున పోలింగ్ సిబ్బందిని నియమించారు. రాజానగరం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని మూడు మండలాలలో 5,845 మంది పట్టభద్రులైన ఓటర్లున్నారు. వీరిలో 3,785 మంది పురుషులు, 2,060 మంది మహిళలు ఉన్నారు. మండలాల వారీగా చూస్తే కోరుకొండలో 1,806 (1,234 మంది పురుషులు, 572 మంది స్త్రీలు), సీతానగరంలో 1,516 (915 మంది పురుషులు, 601 మంది స్త్రీలు), రాజానగరంలో 2,523 (1,636 మంది పురుషులు, 887 మంది స్త్రీలు) ఉన్నారు. వీరంతా ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటలలోపు ఓటు చేసేందుకు వీలుగా కోరుకొండలో రెండు (తహసీల్దార్ కార్యాలయం, సబ్ ట్రెజరీ ఆఫీసు), సీతానగరంలో రెండు (జూనియర్ కాలేజ్ నార్త్ సైడ్, సౌత్ సైడ్), రాజానగరంలో మూడు (తహసీల్దార్ కార్యాలయం, మండల మహిళా సమాఖ్య భవనం, ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం) చొప్పున ఏడు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటుచేశారు.

గుర్తింపు కార్డు తప్పనిసరి

ఓటు హక్కును వినియోగించుకునేందుకు సంబంధిత ఓటరు ఎన్నికల కమిషన్ సూచించిన వాటిలో ఏదో ఒక గుర్తింపు కార్డును తప్పనిసరిగా తీసుకురావాల్సి ఉందని రాజానగరం తహసీల్దార్ జీఏఎల్ఎస్ దేవి తెలిపారు. ఓటరు స్లిప్ లేకుంటే సంబంధిత పోలింగ్ కేంద్రం వద్ద ఉంటే ఎంక్వైరీలో ఆయా ఓటరు వివరాలను తెలుసుకునే సదుపాయం ఉందన్నారు.

చేరుకున్న పోలింగ్ సిబ్బంది

బిక్కవోలు: మండలంలోని గురువారం ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు మండలంలో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తహసీల్దార్ కృష్ణ తెలిపారు. మండలంలో మూడు పోలింగ్ కేంద్రాల పరిధిలో 1,934 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 1,216 మంది, స్త్రీలు 718 మంది ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. రెండు పోలింగ్ కేంద్రాలు (148, 149) తహసీల్దార్ కార్యాలయం వద్ద, మరో పోలింగ్ కేంద్రం(147) మండల పరిషత్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేశారు. ఇప్పటికే ఆయా పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది చేరుకున్నట్టు ఎన్నికల అధికారులు తెలిపారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు రెండు పోలింగ్ కేంద్రాలు

రంగంపేట: పట్టభద్రులందరూ తమ ఓటును వినియోగించుకోవాలని తహసీల్దార్ కోసు అనసూయ అన్నారు. రంగంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాలను బుధవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో 17 గ్రామ పంచాయతీల పరిధిలో 1,250 పట్టభద్రుల ఓట్లు ఉన్నాయన్నారు. వీరి కోసం రెండు పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశామన్నారు. ఓటర్లందరూ స్లిప్‌తో పాటు ఆధార్, పాన్ తదితర ఏదైనా గుర్తింపు కార్డు తీసుకురావాలన్నారు. బ్యాలెట్ విధానంలో ఓటింగ్ ఉంటుందన్నారు. ఆమె వెంట ఎంపీడీఓ వి.వీర సాయిబాబు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

ఘనంగా ఆర్‌సీఎం చర్చి శత వార్షికోత్సవం



ఆర్‌సీఎం చర్చి శత వసంతాల వేడుకలో కేక్ కట్ చేస్తున్న బిషప్‌లు

- బిషప్‌ల చేతుల మీదుగా వేడుకలు
- తరలివచ్చిన విశ్వాసులు
- అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ఫ్రెంచ్ గురువులు నిర్మించిన పునీత జోన్ ఆఫ్ ఆర్క్ చర్చి(ఆర్‌సీఎం) శత వసంతంలోకి అడుగుపెట్టడం ఆనందకరమని విశాఖపట్నం ఆర్క్ డయాసీస్ అపోస్తలిక్ అడ్మినిస్ట్రేటర్ రెవరెండ్ బిషప్ పొలిమేర జయరావు అన్నారు. ఆల్కాట్‌తోటలోని ఆర్‌సీఎం చర్చి శత వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పొలిమేర జయరావు, శ్రీకాకుళం బిషప్ రాయరాల విజయ కుమార్, విశాఖపట్నం ఆర్క్ బిషప్ మల్లవరపు ప్రకాష్ ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. చర్చి శత వార్షికోత్సవంలోకి అడుగుపెట్టిన సందర్భంగా దైవజనులు, విశ్వాసులకు శుభాకాంక్షలు తెలిపారు. గురుత్వ రజత జూబ్లీ వేడుకలు జరుపుకొంటున్న రెవరెండ్ ఫాదర్ బవిరి సురేష్, రెవరెండ్ ఫాదర్ ఆగ్నేల్ రవీంద్ర కుమార్ 25 ఏళ్ల పాటు విశిష్ట సేవలు అందించారన్నారు. ఈ సందర్భంగా ప్రావిన్షియల్ సుపీరియర్ బవిరి సురేష్, పునీత జోన్ ఆఫ్ ఆర్క్ చర్చి ఫాదర్ ఆగ్నేల్ రవీంద్ర కుమార్‌లను బిషప్‌లు, గురువులు, విశ్వాసులు, కుటుంబ సభ్యులు ఘనంగా సత్కరించారు. ముందుగా 100 కిలోల కేక్‌ను కట్ చేశారు. సెయింటాన్స్ స్కూల్ విద్యార్థినుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. ఆర్‌సీఎం చర్చి అసిస్టెంట్ ఫాదర్ కె.ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన ఈ వేడుకలలో అధిక సంఖ్యలో గురువులు, కౌన్సిల్ మెంబర్లు, విశ్వాసులు పాల్గొన్నారు.